క్లుప్తంగా

'బొగత' వద్ద భక్తుల పూజలు



వాజేడు : మండల పరిధిలోని బొగత జలపాతం వద్ద ఉన్న లక్ష్మీనర్సింహస్వామికి శనివారం భక్తులు పూజలు చేశారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు కొబ్బరికాయలు కొట్టారు. ఆలయం వద్ద ఉన్న పూజారులు భక్తుల కోరిక మేరకు పూజలు నిర్వహించారు.

కేజీబీవీకి వెళ్లేది ఎలా..?



ఏటూరునాగారం: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలకు వెళ్లే దారి బురదమయంగా మారడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బంది పడుతున్నారు. గతంలో సీసీ రోడ్డు వేసినప్పటికీ ఈ రోడ్డు నుంచి ప్రధాన రోడ్డు వరకు బురదగా మారింది. జీపీ అధికారులు, సిబ్బంది ఈ పాఠశాలకు వెళ్లే రోడ్డుపై దృష్టిసారించి బురదను తొలగించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

బందెల దొడ్డిలో గేదె మృతి

మంగపేట: మండలంలోని కమలాపురం బందెల దొడ్డిలో ఉన్న గేదె శనివారం మృతి చెందింది. బందెకు వచ్చిన ఒక్కో శాల్తీకి రూ.500 రుసుసు వసూలు చేస్తున్న పంచాయతీ అధికారులు బందెల దొడ్డిలో ఉండే పశువులకు నీళ్లు, మేత పెట్టడంలో పూర్తి నిర్లక్ష్యంగా వహస్తున్నారన్నారు. దీని కారణంగానే పశువులు అనారోగ్యం బారిన పడి మృతి చెందుతున్నాయని, అందులో భాగంగానే మేతలేక గేదె చనిపోయిందని ఆరోపిస్తూ గ్రామస్తులు సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేశా రు. ఈ విషయంపై వివరణ అడిగేందుకు గ్రామ పంచాయతీ కార్యదర్శి అందుబాటులో లేకపోవడంతో పంచాయతీ బిల్ కలెక్టర్ కొమిరెల్లిని వివరణ అడుగగా గ్రామానికి చెందిన సాంబయ్య రెండు రోజుల క్రితం గేదెను బందెల దొడ్డిలో పెట్టాడని గేదెకు వ్యాధి సోకి అనారో గ్యంగా ఉండటంతో గేదె యజమాని రాజుకు సమాచారం ఇచ్చి వైద్యం కూడా చేయించా మ ని అయినప్పటికీ మృతి చెందినట్లు తెలిపాడు.

అంధకారంలో టీచర్స్ కాలనీ

మంగపేట: మండల కేంద్రంలోని టీచర్స్ కాలనీ, గంపోణిగూడెంలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం 9 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో రెండు కాలనీలు అంధకారంలో ఉన్నాయి. కరెంటు సరఫరా నిలిచిపోవడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రెండు కాలనీల్లో కరెంట్ స్తంభాలకు, విద్యుత్ వైర్లకు వివిధ రకాల తీగలు పాకి ఉండటంతో తరచూ విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం కలుగుతుందని కాలనీవాసులు వాపోతున్నారు. పక్కనే విద్యుత్ సబ్‌స్టేషన్, అధికారులు ఉన్నప్పటికీ ఏ మాత్రం పట్టించుకోవడం లేదని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి కరెంటు సరఫరాలో అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకోవాలని కాలనీల వాసులు కోరుతున్నారు.

ఐరన్ బ్రిడ్జికి ఆదిలోనే ఆటంకం

- పనులు చేస్తుండగానే ఊడిపోతున్న వెల్డింగ్
- నిర్లక్ష్యపు ధోరణిలో ఐటీడీఏ ఇంజనీరింగ్



ఊడిపోతున్న ఐరన్ ఫుట్ ఓవర్ బ్రిడ్జి

ఏటూరునాగారం: మండలంలోని కొండాయి సమీపంలోని దొడ్ల మల్యాల గ్రామాల మధ్య ప్రవహిస్తున్న జంపన్న వాగుపై నిర్మిస్తున్న ఐరన్ బ్రిడ్జి ఆదిలోనే హంసపాదంలా మారింది. ఒకవైపు పనులు చేస్తుండగానే ఇనుప దిమ్మెలకు అతికించిన వెల్డింగ్ వాటి బరువుకు ఆగలేక ఊడిపోతున్నాయి. గత సంవత్సరం ఉధృతమైన వరదలకు వాగుపై నిర్మించిన శాశ్వత బ్రిడ్జి కొట్టుకుపోయిన విషయం విదితమే. ఈ వర్షాకాలంలో మల్యాల కొండాయి ఐలాపూర్ గ్రామాల ప్రజలకు మళ్లీ కష్టాలు మొదలయ్యాయి. కొద్దిరోజుల నుంచి కురుస్తున్న మోతాదు వర్షాలకే జంపన్న వాగులో చిన్నపాటి వరదలు ప్రారంభమయ్యాయి. ఆయా గ్రామాల ప్రజలు వాగు దాటి రావడానికి తీవ్ర అవస్థలు పడుతున్నారు. పీకల్లోతు నీటిలో ఒకరినొకరు జంటలు పట్టుకొని ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వాగులు దాటుతున్నారు. మంత్రి సీతక్క చొరవ చూపి జంపన్నవాగుపై తాత్కాలిక ఐరన్ ఫుడ్ వంతెన నిర్మాణం చేపట్టడానికి రూ. 35 లక్షల నిధులు ప్రభుత్వం నుంచి మంజూరు చేయించారు. ఐటీడీఏ ఇంజనీరింగ్ శాఖ ద్వారా వంతెన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. బ్రిడ్జి నిర్మాణం గత రెండు నెలల క్రితమే ప్రారంభించినప్పటికీ కొద్దిపాటి వరదకే పనులు నిలిచిపోయాయి .దాంతో ప్రజలు వాగు దాటలేక నానా అవస్థలు పడుతున్నారు. కాగా వరద తగ్గుముఖం పట్టడంతో మళ్లీ పనులు మొదలుపెట్టారు. గత సంవత్సరం వరదలకు బ్రిడ్జి మధ్యలో కొట్టుకుపోయి రెండు చివరల పూర్తిగా వంగిపోయి ఉంది. అయితే తాత్కాలికంగా నిర్మిస్తున్న ఈ ఐరన్ వంతెనను మధ్యలో కొట్టుకుపోయిన సిమెంట్ ఫిల్లర్ స్థానంలో తిరిగి ఐరన్ పిల్లర్‌ను నిటారుగా నిలబెట్టి బిగించారు. దీనిపై నుంచి రెండు చివరల కొద్దికొద్దిగా ఉన్న బ్రిడ్జిపై ఈ ఐరన్ ఫుట్ వంతెనను నిర్మిస్తున్నారు. అయితే వంతెన విడిభాగాలను వెల్డింగ్ చేసి అతికిస్తున్నారు. కానీ రెండు చివరల బ్రిడ్జి పూర్తిగా వంగిపోయి ఉండడంతో ఫుట్ ఐరన్ బ్రిడ్జి తునికిసలాడుతూ పనివాళ్లు నడుస్తుంటేనే జాయింట్లు ఊడిపోతున్నాయి. కానీ నిర్మాణం పూర్తయ్యాక వరదల సమయంలో ప్రజలు వాగును దాటుతున్న క్రమంలో ఈ విధంగా జాయింట్లు ఊడిపోతే పరిస్థితి ఏమిటని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. గతంలో ఐటీడీఏ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన శాశ్వత బ్రిడ్జి వరదలకు నామరూపాలు లేకుండా కొట్టుకుపోయింది. తాత్కాలిక ఐరన్ వంతెన పనులు కూడా అలాగే కొనసాగుతున్నాయి. అధికారుల ఆలోచనా లోపమా లేక వారి నిర్లక్ష్యమా అనేది ప్రశ్నార్థకంగా మారింది. మంత్రి సీతక్క లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఎలాంటి హానీ జరగకుండా ఉండడానికి ముందస్తు చర్యలు చేపడితే అధికారులు వారి నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తూ పనులను ఆదిలోనే అంతమొందిస్తున్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి పనులు నాణ్యత లోపంతో ఉండకుండా చూడాలని లోతట్టు ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

లారీలు నిలపకుండా చర్యలు తీసుకోవాలి



టీఎండీసీ పీఓకు సమస్యను వివరిస్తున్న సీపీఎం నాయకులు

వెంకటాపురం(కె): మండలంలో రోడ్డుకు ఇరువైపుల ఇసుక లారీలను పెట్టకుండా చర్యలు తీసుకోవాలని టీఎండీసీ పీఓ శ్రీరాములను సీపీఎం నాయకులు శనివారం నిలదీశారు. మండలంలోని పాత్రాపురం నుంచి రోడ్డుకు ఇరువైపుల లారీలను పెట్టడంతో రోడ్డుపై వచ్చే ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంపై టీఎండీసీ పీఓ మాట్లాడుతూ హెడాఫీస్ నుంచి పెద్ద సంఖ్యలో డీడీలు రావడంతో ఈ సమస్య తలెత్తుందని చెప్పారు. ఆదివారం నుంచి నాలుగు రోజుల పాటు లోడింగ్ నిలిపివేశామని అన్నారు. మండలంలో లారీలతో ఇబ్బందులు తలెత్తకుండా ర్యాంపులకు అనుగుణంగా అనుమతులు ఇస్తామని తెలిపారు. టీఎండీసీ పీఓను కలిసిన వారిలో సీపీఎం నాయకులు బీరెడ్డి సాంబశివ రెడ్డి, గ్యానం వాసు, కట్ల నర్సింహాచారి, మాణిక్యం, విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

పరామర్శ



ములుగు రూరల్ : మండలంలోని కాశిందేవిపేట గ్రామానికి చెందిన గుండాల రవి, కొండబోయిన మల్లయ్య, మదనపల్లి గ్రామానికి చెందిన బల్గూరి సత్యంలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాలను బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు గండ్రకోట సుధీర్‌యాదవ్ పరామర్శించారు. శనివారం బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం అందించారు. పరామర్శించిన వారిలో అమర్‌సింగ్, స్వామిరావు, రామారావు, కవ్వంపల్లి బాబు, భాస్కర్, అంకూస్, నర్సయ్య, తదితరులు ఉన్నారు.

వల్లెకుంటలో కంటి వైద్యశిబిరం



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

మల్హర్: మండలంలోని వల్లెకుంట గ్రామ పంచాయతీలో వల్లెకుంట అంబేడ్కర్ యువజన సంఘం, అమృత వర్షిని అక్షర స్వచ్ఛంధ సేవా సొసైటీ భూపాలపల్లి వారి సంయుక్త నిర్వహణలో ఆదివారం ఉచిత కంటి శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 60 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో 25 మందికి కంటి శస్త్ర చికిత్సలు అవసరం ఉన్న వారిని గుర్తించామని, త్వరలోనే స్వచ్ఛంధ సంస్థ ద్వారా ఆపరేషన్లు చేయించడం జరుగుతుందని నిర్వాహకులు వెల్లడించారు. డిప్లమాఫ్తాల్ అసిస్టెంట్ దినేష్, కిషోర్, 20 మంది యువజన సభ్యులు పాల్గొన్నారు.

లంపిస్కిన్ నివారణ టీకాలు వేయించాలి



టీకా వేస్తున్న తిరుపతి

భూపాలపల్లి రూరల్: పశువులకు లంపి స్కిన్ వైరస్ నివారణ టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి తిరుపతి రైతులకు సూచించారు. శనివారం మండలంలోని బావుసింగ్‌పల్లి పంచాయతీ శివారు లక్ష్మీపురం గ్రామంలో పశువులను లంపి స్కిన్ నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా వైద్యుడు తిరుపతి మాట్లాడుతూ.. లంపి స్కిన్ అనే వ్యాధి తెల్లజాతి పశువులల్లో ఎక్కువగా సోకుతుందని, వ్యాధి సోకిన తర్వాత దాదాపు వారం రోజులు జ్వరం వస్తుందన్నారు. పశువుల శరీరంపై కంతులు (నాడ్యులర్) ఏర్పడి పెద్దవిగా మారి పగిలి గాయాలు ఏర్పడతాయని తెలిపారు. దీంతో పాల ఉత్పత్తి తగ్గుతుందన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మహాముత్తారం: మహాముత్తారం సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ సబ్‌ఇంజనీర్ కొమురయ్య శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సబ్‌స్టేషన్‌ల్లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్, 11కేవీ బ్రేకర్స్ ఏర్పాటు చేయడంతోపాటు 11కేవీ మిడిల్ పోల్ లెన్త్‌లైన్ వర్క్ విద్యుత్ లైన్లో కంట్రోల్ ఏబీ స్విచ్‌లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఉదయం నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

సేవాదళ్ మండల అధ్యక్షుడిగా రాంబాబు



వాజేడు: మండల కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడిగా రాణి మేకల రాంబాబు నియమితులయ్యా రు. సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి కొదుమూరి దయాకర్ ఇచ్చిన నియామక పత్రాన్ని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు గురువారం భద్రాచలంలో తనకు అందజేయగా అందుకు సంబంధించిన నియామక పత్రాన్ని శనివారం రాంబాబు చూపించారు.

నేడు పీఏసీఎస్ చైర్మన్ ఎన్నిక

మల్హర్: మల్హర్ మండలం తాడిచర్ల వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) నూతన చైర్మన్ ఎన్నిక నేడు(ఆదివారం) జరగనుంది. తాడిచర్ల సహకార కార్యాలయంలో ఎలక్షన్ అధికారి పీ రాజు ఆధ్వర్యంలో చెర్మన్ ఎన్నిక నిర్వహించనున్నారు. చైర్మన్‌పై పడిన అనర్హత వేటు కారణంగా నూతన చైర్మన్ ఎన్నిక జరుగునుంది. తాడిచర్ల సొసైటీలో 13 మంది డైరెక్టర్లల్లో చైర్మన్ రామారావు, ఇద్దరు డెరెక్టర్లు రాజేశ్వర్‌రావు, రమేశ్‌రెడ్డిలపై అనర్హత వేటు పడగా ఓ డైరెక్టర్ అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో సొసైటీలో 9 మంది డెరెక్టర్లు ఉండగా కాంగ్రెస్ పార్టీకి చెందిన డైరెక్టర్లు ఆరుగురు, బీఆర్ఎస్ పార్టీకి చెందిన ముగ్గురు ఉన్నారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు అభ్యర్థుల నుంచి ఎన్నికల అధికారి నామినేషన్లు స్వీకరించనున్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విత్ డ్రాలు స్వీకరించనున్నారు. సాయంత్రం 3 గంటల నుంచి 5 గంటల వరకు రహస్య పద్ధతిలో ఓటింగ్ నిర్వహించనున్నారు.

జ్వరం వస్తే ఆస్పత్రికి రావాలి



వాజేడు: రోగిని పరీక్షిస్తున్న వైద్యురాలు గ్యానస

వాజేడు : జ్వరం వస్తే తప్పనిసరిగా రోగులు ఆస్పత్రికి రావాలని ప్రగళ్లపల్లి పల్లె దవాఖాన వైద్యాధికారి గ్యానస అన్నారు. మండలంలోని బిజినేపల్లి, మొరుమూరు గ్రామాల్లో శనివారం వైద్యశిబిరాలు నిర్వహించి 71 మంది రోగులను పరీక్షించారు. అందులో 8 మంది గర్భిణీలు, 9 మందికి రక్తపూతలను తీశారు. నలుగురికి ఆర్డీటీ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లడుతూ వర్షాకాలం వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. కార్యక్రమంలో కోటిరెడ్డి, వెంకటరమణ, రాజేశ్వరి, అరుణ, ప్రసన్న లక్ష్మి ఉన్నారు.



వెంకటాపురం(కె): ఇంటింటి ఫీవర్ సర్వే నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

చిరుతపల్లిలో ఇంటింటి ఫీవర్ సర్వే

వెంకటాపురం(కె): మండలంలోని చిరుతపల్లి, నూగూరు గ్రామాల్లో శనివారం వైద్యశాఖ ఆధ్వర్యంలో ఇంటింటి ఫీవర్ సర్వే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ఇంట్లో ఎంత మంది సభ్యులు ఉంటున్నారు, ఎవరైనా జ్వరంతో బాధ పడుతున్నారా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులకు మలేరియా టెస్టులు నిర్వహించారు. అనంతరం వైద్య శిబిరం నిర్వహించి గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి మందులను అందజేశారు. వైద్య సిబ్బంది యాకలక్ష్మి, స్వరూప, సరస్వతీ పాల్గొన్నారు.

దంపతులను చంపిన ఉన్మాదికి ఉరిశిక్ష వేయాలి



మాట్లాడుతున్న పోరిక గోవింద్ నాయక్

ములుగు: వేట కొడవలితో దంపతులను నరికి చంపిన ఉన్మాదికి తక్షణమే ఉరిశిక్ష వేయాలని మాజీ గ్రంథాలయం చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో బంజారాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదహారు చింతలతండాకు చెందిన బానోత్ శ్రీనివాస్, సుగుణ దంపతులను హత్యచేసిన మేకల నాగరాజును కఠినంగా శిక్షించాలని అన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పోరిక మోహన్‌లాల్, భూక్య సోమనాయక్, జరుపుల బాలు, పోరిక జయరాం, అంగోత్ రాజునాయక్, సునీల్ కుమార్, శ్రీనివాస్, రవి తదితరులు పాల్గొన్నారు.

వాటర్ కూలర్ బహూకరణ



వాటర్ కూలర్‌ను బహూకరిస్తున్న ఉపాధ్యాయులు

చిట్యాల: మండలంలోని నైన్‌పాక ఉన్నత పాఠశాలలో పని చేసి ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులంతా కలిసి.. తాగునీటి కోసం విద్యార్థులకు రూ.38 వేల విలువ గల వాటర్ కూలర్‌ను శనివారం బహూకరణ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు ఊర్మిళ, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం బదిలీ అయిన ఉపాధ్యాయులు ఆలేటి సాంబయ్య, క్యాతం శ్రీధర్, మోత్కూరి లావణ్య, సిరిపురం సతీష్, నూకల లింగయ్య మాట్లాడుతూ.. విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరారు. అలాగే ఎన్ఎంఎంఎస్‌లో, ఐఐటీలో సీట్లు సాధించిన వారికి రెండు వేల రూపాయాల విలువ గల ఆర్ఎస్ అగర్వాల్ పుస్తకం ఉచితంగా అందిస్తామని ఉపాధ్యాయుడు శ్రీధర్ తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులకు విద్యార్థులు ఘనంగా సన్మానం చేసి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, ప్రణీత, స్వాతి, విజయశాంతి, పల్లవి, ప్రవీణ్‌కుమార్, సుజాత, రమేష్, రాజయ్య, రఘు, శుభాషిణి, ఓదేలు, సీఆర్‌పీ తిరుపతి, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలు విక్రయిస్తే చర్యలు



గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు

కాళేశ్వరం: నిషేధిత మత్తు పదార్థాలైన గుట్కా, అంబర్ లాంటిని విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మహదేవపూర్ ఎస్సై పవన్‌కుమార్, కాళేశ్వరం ఇన్‌చార్జ్ ఎస్సై చక్రపాణి, పలిమెల ఎస్సై తమాషారెడ్డి తెలిపారు. మహదేవపూర్ మండల పరిధిలోని బెగ్లూర్ గ్రామంలో శనివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటా తనిఖీలు చేపట్టారు. అనంతరం గ్రామంలోని ప్రధాన కూడలిలో నిర్వహించిన సమావేశంలో గ్రామస్తులతో వారు మాట్లాడారు. గ్రామంలోకి ఎవరైన అనుమానిత వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. యువత మత్తు పదార్థాలకు బానిస కావొద్దన్నారు. చక్కగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని తెలిపారు. గ్రామంలో నంబర్‌ప్లేట్లు లేని 19 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, యువకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కూలిన అప్రోచ్ రోడ్డుకు మరమ్మతులు



అప్రోచ్ రోడ్డుకు మరమ్మతులు చేసిన దృశ్యం

మంగపేట: మండలంలోని బుచ్చంపేట పంచాయతీ పరిధిలోని జబ్బోనిగూడెం సమీపంలోని చెరుపల్లి పెద్దచెరువు మత్తడి ఒర్రెపై నిర్మించిన మినీబ్రిడ్జి వద్ద కూలిన అప్రోచ్‌రోడ్డుకు పంచాయతీరాజ్ శాఖ అధికారులు తాత్కాలిక మర్మతులు చేపట్టి శనివారం రోడ్డును పునరుద్ధరించారు. ఈనెల 10న చెరుపల్లిపెద్దచెరువు మత్తడి ఒర్రెపై మల్లూరు వాగు ప్రాజెక్టు ఎడమకాల్వపై నిర్మించిన(అక్వాడక్ట్) బుధవారం తెల్లవారుజామున కూలిపోవడంతో దీనికి పక్కనే నిర్మించిన బ్రిడ్జికి సీసీ రోడ్డుకు మధ్యలో అప్రోచ్ రోడ్డు కోతకు గురై కూలిపోయిన విషయం తెలిసిందే. దీంతో కేవలం ద్విచక్రవాహనం, పాదచారులు తప్ప ఇతర వాహనాలు వెళ్లేందుకు వీలులేక పోవడంతో గ్రామానికి ఇతర వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. సంఘటనా స్థలాన్ని పంచాయతీ రాజ్ శాఖ ఏఈ వాసుదేవరెడ్డి పరిశీలించి గ్రామపంచాయతీ అధికారుల సహకారంతో కూలిన అప్రోచ్ రోడ్డు వద్ద మొరంతో నింపి గ్రామానికి పూర్తిస్థాయిలో రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలుగకుండా ఉండే విధంగా తాత్కాలికంగా మర్మతులు నిర్వహించి రోడ్డును పునరుద్ధరించారు.

పంచాయతీల్లో పైసల్లేవ్

- నిధులు మంజూరు చేయని ప్రభుత్వాలు
- అప్పులపాలైన కార్యదర్శులు
- బదిలీలతో ఖర్చు చేసిన డబ్బులపై ఆందోళన



దామరంచపల్లి పంచాయతీ కార్యాలయం

రేగొండ: గ్రామాల్లో సర్పంచ్‌ల పాలన ముగిసిపోవడంతో ప్రత్యేక అధికారులకు పరిపాలనా బాధ్యతలను అప్పగించారు. ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శులు క్షేత్ర స్థాయిలో పంచాయతీ పాలనను నిర్వహిస్తున్నారు. అయితే అధికారుల పాలనకు ముందే పంచాయతీ ఖాతాలన్ని ఖాళీ అయ్యాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేయకపోవటంతో ప్రత్యేక పాలన మొక్కుబడిగా సాగుతుంది. ఉమ్మడి రేగొండ మండలంలో 37 గ్రామపంచాయతీలు ఉండగా ఫిబ్రవరి 2 నుంచి ప్రత్యేక అధికారుల పాలన నడుస్తోంది. పంచాయతీల కనీస అవసరాలను తీర్చే బాధ్యత కార్యదర్శులపై పడింది. నిధుల కొరతతో ఒక్కో కార్యదర్శి రూ.లక్షల్లో అప్పులు చేసి ఖర్చు పెట్టారు. పంచాయతీ కార్యదర్శుల బదిలీలు ఉండటంతో తాము ఖర్చు పెట్టిన డబ్బును ఎలా రాబట్టుకోవాలో తెలియక ఆందోళన చెందుతున్నారు.


మూడు ఖాతాలు ఖాళీ..

గ్రామ పంచాయతీల్లో మూడు రకాల ఖాతాలు ఉన్నాయి. ఒకటి ఆస్తి పన్నులు జమ చేసేందుకు ఉపయోగించే ఖాతా. గ్రామాల్లో ఆస్తి పన్ను వసూళ్లు జరుగుతున్నా ఖర్చు నాలుగింతలు ఉండటంతో ఈ ఖాతా ఎప్పుడు ఖాళీగానే ఉంటుంది. రెండో ఖాతా ఎస్ఎఫ్‌సీలో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసే నిధులు, గ్రాంట్లను జమ చేస్తారు. రెండేళ్ల నుంచి రాష్ట్ర ప్రభుత్వం నిధులను మంజూరు చేయడం లేదు. ఈ రెండు ఖాతాల్లో జమయ్యే నిధులను ట్రెజరీ ద్వారా పంచాయతీలు డ్రా చేసుకుంటాయి. మూడో ఖాతా 15వ ఆర్థిక సంఘం నిధులను జమ చేసేందుకు ఉపయోగిస్తారు. కేంద్ర ప్రభుత్వం నేరుగా ఈ ఖాతాలోకి ప్రతి రెండు నెలలకోసారి నిధులను మంజూరు చేస్తోంది. కేంద్ర నిబంధనల ప్రకారం ఈ నిధులను ఖర్చు చేయాల్సి ఉంటుంది. కాని గత నాలుగు నెలల నుంచి నిధులు మంజూరు కాలేదు.

అప్పులపాలు..

గ్రామ పంచాయతీల్లో ట్రాక్టర్ల కిస్తీల చెల్లింపు, నిర్వహణ ఖర్చులు, కార్మికుల వేతనాల చెల్లింపు, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ తదితర పనులకు నిధుల్లేక పంచాయతీ కార్యదర్శులు ఆందోళన చెందుతున్నారు. కొన్ని గ్రామపంచాయతీల్లో ఆరు నెలల నుంచి పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలను చెల్లించలేని పరిస్థితి నెలకొంది. నిధుల సమస్యను ప్రత్యేక అధికారుల దృష్టికి తీసుకెళ్తే తమకేమి తెలియదని, నిధులు ఎలా సమకూర్చుకోవాలో మీకే తెలుసంటూ తప్పించుకుంటున్నారని కార్యదర్శులు వాపోతున్నారు. ఒక్కో పంచాయతీలో కార్యదర్శులు రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు అప్పులు చేసి ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం కార్యదర్శుల బదిలీలు ఉండటంతో తాము ఖర్చు పెట్టిన డబ్బులను ఎలా రాబట్టుకోవాలో తెలియక ఆందోళన చెందుతున్నారు.

ప్రకాశ్‌రెడ్డికి సన్మానం



ప్రకాశ్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

మల్హర్: రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఎన్నికైన అయిత ప్రకాశ్‌రెడ్డిని మండల కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ప్రకాశ్‌రెడ్డిని ఆదివారం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇందారపు చంద్రయ్య, బబ్బులి రాజు, ఆర్ని ఉదయ్, సురేష్ రావు, మావురపు వెంకన్న, కన్నూరి అశోక్, శ్రీనివాస్, సంపత్, సిద్ధిక్ రఘు, నాగేంద్రబాబు, శంకర్, రాజు, అనిల్, తిరుపతి పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ములుగు :
9705748198
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
డి. గణేష్ బాబు (S.R) : 9490002099, 7997958188
పి.చంద్రశేఖర్ (A.C.O) : 9963646944